కరుణించమ్మా కనకమాంబ

- అమ్మవారి పండగ మహోత్సవానికి భారీ ఏర్పాట్లు
- నేడు తొలేళ్లు, రేపు ప్రధాన జాతర
- ముస్తాబైన త్రిశక్తి ఆలయం


విద్యుత్ దీపాల అలంకరణలో వీధి


గణేష్‌నగర్‌లో ఆకట్టుకుంటున్న అమ్మవారి ఎల్‌ఈడీ కటౌట్


అమ్మవారి పండగకు ముస్తాబైన సీతంపేట త్రిశక్తి ఆలయం


త్రిశక్తి ఆలయంలో కనకమాంబ

సీతంపేట: గ్రామ దేవతల పండగలు మన సంస్కృతిలో భాగం. గ్రామాన్ని, అక్కడి ప్రజలను గ్రామ దేవతలు కాపాడతారని భక్తుల విశ్వాసం. ప్రతి ఏటా అమ్మవార్లకు జాతర జరిపించి, గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి పసుపు, కుంకుమ, చీర, గాజులు, మొక్కులు అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీ. సీతంపేటలో వందేళ్ల కిందట వెలసిన భూలోకమాత, కనకమాంబ, పైడిమాంబ ముగ్గురు అమ్మవార్లతో కొలువైన త్రిశక్తి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏటా ఒక అమ్మవారి పేరున పెద్ద ఎత్తున పండగ నిర్వహిస్తుంటారు. ఈ సారి కనకమాంబ అమ్మవారి పండగ మహోత్సవానికి శ్రీకృష్ణ యువజన సంఘం ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఆదివారం అమ్మవారి పండుగ చాటింపు చేశారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి పురవీధుల్లో ఉజ్జిరీ బండి, సాయంత్రం 6 గంటల నుంచి తొలేళ్ల పండగకు సన్నాహాలు పూర్తి చేస్తారు. మంగళవారం కనకమాంబ అమ్మవారి ప్రధాన పండగ అంగరంగ వైభవంగా జరపడానికి సంఘం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా దాతల విరాళాలతో అమ్మవారి ఆలయాన్ని చూడముచ్చటగా ఆధునీకీకరించామన్నారు. గుడి లోపల గ్రానైట్ ఫ్లోరింగ్, వాల్స్, ఆలయం చుట్టూ స్టెయిన్‌లెస్ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు, ఆలయానికి రంగురంగుల పెయింటింగ్ వేశారు.

ఊరంతా పండగ సందడి

గణేష్‌నగర్‌లో కొలువైన కనకమాంబ ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూల దండలు, వేపమండలతో ముస్తాబు చేశారు. సీతంపేటలోని ప్రతి వీధిలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధాన కూడళ్లల్లో అమ్మవార్ల ఎల్‌ఈడీ కటౌట్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 13న కనకమాంబ అమ్మవారి ప్రధాన పండగ సందర్భంగా సేవా గరిడీలు, కోయ డ్యాన్సులు, ధూంధాం డ్యాన్సులు, నేల డ్యాన్సులు, తప్పెటగుళ్లు, కర్రసాము వంటి సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యుత్ దీపాలంకరణ, బాణసంచా అనుపు మహోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అదే రోజు సాయంత్రం సీతంపేట మెయిన్ రోడ్, దుర్గాగణపతి ఆలయం వద్ద స్టేజీ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. రెండేళ్ల తర్వాత భారీగా చేస్తున్న పండగకు ఆహ్వానిస్తూ ఉత్సవ కమిటీ సీతంపేటలోని ఇంటింటికీ వెళ్లి పత్రాలు అందజేశారు.

జేవీకే కిట్లు పంపిణీకి సిద్ధం


మాధవధార ప్రాథమిక పాఠశాలలో జేవీకే కిట్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది


ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లు భద్రపరుస్తున్న ఉపాధ్యాయులు

మురళీనగర్: పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధం చేశారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాల, బర్మా క్యాంప్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల తరగతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. మాధవధార హైస్కూల్ లో 6–10 తరగతుల వరకు 801 మంది విద్యార్థులు ఉన్నారు. మాధవధార ప్రాథమిక పాఠశాలలో 448 మంది, కె.కాలనీ హైస్కూల్‌లో 532 మంది విద్యార్థులు, బర్మా క్యాంప్ ప్రాథమిక పాఠశాలలో 370 మంది విద్యార్థులు ఈ ఏడాది నమోదయ్యారు. వీరందరికీ తరగతి గదులను సిద్ధం చేశారు. తరగతుల వారీగా విద్యార్థులకు స్థానిక ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా జేవీకే కిట్లు అందజేయనున్నారు.

ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌కు కిట్లు

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌కు ఆదివారం జగనన్న విద్యా కానుక కిట్లు చేరడంతో వాటిని ఒక గదిలో ఉపాధ్యాయులు భద్రపరిచారు. 1100 మంది విద్యార్థులకు సరిపడా నోట్‌బుక్స్, బ్యాగ్స్, షూస్, యూనిఫారం తదితర వస్తువులతో కూడిన కిట్లు వచ్చాయి. స్కూల్ ప్రారంభం రోజున విద్యార్థులకు వాటిని పంపిణీ చేస్తామని హెచ్‌ఎం రాంప్రసాద్ తెలిపారు.

అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: రౌడీ షీటర్లు అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని ద్వారకా జోన్ సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం తాగి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరి పనుల్లో వారు ఉండాలని, ఎక్కడ పనిచేస్తున్నది వివరాలు తెలియపరచాలని చెప్పారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీ షీటర్లను వారి ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రేక్షకులకు చేరువగా మంచి సినిమాలు


సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు

సీతంపేట: మంచి సినిమాలను ప్రేక్షకులకు దగ్గర చేయడమే వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ముఖ్య ఉద్దేశమని సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. బుల్లయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం సొసైటీ గౌరవాధ్యక్షుడు ఆచార్య ఎస్.ఎ.డి.పాల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరయ్యేందుకు, ఎన్టీ రామారావు జయంతి నిర్వహణ, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యాలయం, సభ్యుల చేరిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఉపాధ్యక్షుడు ఎ.కాశీ విశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి వి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివ కుమార్, ఆర్.బాబ్జి పాల్గొన్నారు.

మురళీనగర్‌లో చిరుజల్లు


మురళీనగర్ వాకర్స్ పార్కులో కురుస్తున్న వర్షం

మురళీనగర్: ఎండలు మండిపోతున్న తరుణంలో ఆదివారం ఉదయం మురళీనగర్‌లో ఆకస్మికంగా వర్షం కురిసింది. ఉదయం 8 గంటల నుంచి సుమారు పది నిమిషాల పాటు కురిసిన వానతో వాతావరణం కాస్త చల్లపడింది. అంతలోనే మళ్లీ ఎండలు తీవ్రతను కొనసాగించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. ఉక్కపోత, వడగాల్పులతో సతమతమయ్యారు. పది గంటలకే వడగాడ్పులు వీచడంతో ప్రజలు ఆందోళన చెందారు. వేడిని తట్టుకోలేక ఫ్యాన్, ఏసీ గదులకు పరిమితమయ్యారు.

వాకర్ ఆకస్మిక మృతి


మృతి చెందిన బీఎస్ఎన్ రెడ్డి

మురళీనగర్: మురళీనగర్‌లో ఒక వాకర్ వాకింగ్ చేస్తుండగా ఆకస్మికంగా మృతి చెందారు. వివరాలిలా.. ఈ ప్రాంతానికి చెందిన బీఎస్ఎన్ రెడ్డి (75) ప్రతి రోజు లాగానే ఆదివారం ఉదయం 5 గంటలకు వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకింగ్‌కు వచ్చారు. ఆయన వాకింగ్ ట్రాక్‌పై ఒక రౌండ్ నడిచిన తర్వాత కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు కూర్చుంటుండగా కుప్పకూలిపోయారు. వాకర్స్ వచ్చి ఆయనకు సపర్యలు చేసి 108కు ఫోన్ చేసినప్పటికి అప్పటికే రెడ్డి మృతి చెందినట్లు గుర్తించారు. అతని మృత దేహాన్ని స్వగృహానికి తరలించారు. గుండె పోటుతో ఆయన మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు జీవిత కాలం సభ్యుడిగా బీఎస్ఎన్ రెడ్డి ఉన్నారు. ఆయన మరణంతో ఆదివారం పార్కును మూసివేశారు. పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, సి.నాగ రాజు, కోశాధికారి మళ్ల రామకృష్ణ సంతాపం ప్రకటించారు.

ఘనంగా రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాలు


రాజగోపాలరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళింగ ప్రతినిధులు

మురళీనగర్: మాధవధార కళింగ ప్రజల నాయకుడు దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాధవధారలోని గోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళింగ సామాజిక వర్గ ప్రతినిధులు కూన వెంకటరావు, సనపలవరప్రసాద్, సనపల నరసింహస్వామి, పూజారి ఉదయ్‌కుమార్, చింతాడ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో డిజిటల్ బోర్డుల ఏర్పాటు



డిజిటల్ బోర్డుపై స్కూల్ పేరు రాస్తున్న ఉపాధ్యాయుడు బెండి ప్రసాద్

సీతమ్మధార: నూతన విద్యా విధానానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లిప్ బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో 20 డిజిటల్ ఫ్లిప్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామ్‌సంగ్(సర్వీసింగ్) కంపెనీ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ విశాఖ అర్బన్ ప్రభుత్వ పాఠశాలల్లో 160 బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో 20 బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా డిజిటల్ బోర్డుపై విద్యా బోధన సులువుగా ఉంటుందని చెప్పారు. ఈ బోర్డుల ద్వారా ప్రాక్టికల్‌గా గుర్తుంటుందని, విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని, టెక్నికల్‌గా ఉపయోగపడుతుందని హెచ్‌ఎం రాంప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బెండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల మాధ్యమంలో ముగిసిన విద్యా బోధన

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గత 6 రోజులుగా నిర్వహిస్తున్న ట్రెనింగ్ ఆఫ్ టీచర్స్–ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి మాట్లాడుతూ శిక్షణ విజయవంతమైందని పేర్కొన్నారు. శిక్షణలో సెల్ఫ్ అవేర్‌నెస్, వకాబులరీ, ప్రొఫిషియెన్సీ, ఎఫెక్టివ్ స్పీకింగ్ స్కిల్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ప్రొనౌన్షియేషన్, కొలబరేటివ్ లెర్నింగ్ అనే అంశాలపై ఎన్‌ఆర్‌సీ పరిధిలోని కళాశాలల అధ్యాపకులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 40 మంది అధ్యాపకులకు శిక్షణ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏజీవో డాక్టర్ సుధ, ఎన్‌ఆర్‌సీ కో ఆర్డినేటర్ డాక్టర్ కేఎల్ శిరీష, మాస్టర్ ట్రెనర్స్ డి. అరుణపద్మ, డాక్టర్ జి. నాగశాంతి, డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, సంతోషి అనూష, డాక్టర్ జీవీవీ ప్రసాద్‌బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన నేమ్ బోర్డులు.. ట్రాఫిక్ ఇబ్బందులు


బీఎస్ లేఅవుట్‌లో దుకాణాల వద్ద రోడ్డుకు అడ్డంగా నిలిపిన కారు



రోడ్డుపై ఏర్పాటు చేసిన షాపుల నేమ్ బోర్డులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బీఎస్ లేఅవుట్ నుంచి షిర్డీసాయిబాబా దేవాలయ ప్రధాన రహదారిలో ఇష్టానుసారంగా కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు పార్క్‌చేస్తున్నారు. అవి ట్రాఫిక్ సమస్యతోపాటు ప్రమాదాలకు కారణమతున్నాయి. ఈ ప్రాంతంలో ఇరానీ టీ షాపు, పక్కనే ఉన్న షాపులు, హోటల్‌తోపాటు రోడ్డుపై డ్రై ఫ్రూట్ షాపు ఏర్పాటు చేయడంతో అక్కడికి వచ్చిన వారంతా రోడ్డుకు అడ్డంగా తమ వాహనాలు నిలిపివేస్తున్నారు. దీనికి తోడు షాపుల నేమ్ బోర్డులు రోడ్డుపై ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించినా.. షాపుల యాజమానులు పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు పెద్దరాజు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిరంతర సాధనతోనే విజ్ఞాన సముపార్జన


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రభాశర్మ

మురళీనగర్: నిరంతరం సాధన, పుస్తక పఠనం ద్వారా విజ్ఞాన సముపార్జన సాధ్యపడుతుందని వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.జయప్రభాశర్మ అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో పఠనం ద్వారా అనేక మంది మహోన్నత వ్యక్తులుగా ఎదిగారని పేర్కొన్నారు. ఉన్నత విలువలు కలిగిన వ్యక్తులుగా తయారు కావాలని విద్యార్థులకు సూచించారు. సమ్మర్ క్యాంప్‌లో వివిధ పోటీల్లో గెలుపొందిన పిల్లలకు ప్రభాశర్మ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఎం.శంకరరావు, జామి అన్నాజీ, వనిత వాకర్స్ క్లబ్ కార్యదర్శి రోజారాణి, జి.శిరీషలత, షీలా రాణి, గ్రంథాలయ అధికారి వై.పద్మజ పాల్గొన్నారు.

వైభవంగా శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం


అలంకరణలో ఎర్నిమాంబ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఆలయ పునర్నిర్మాణం, ఆలయ శిఖర ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. వేద పండితుల ఆధ్వర్యంలో విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా గణపతి పూజ, దీక్షాధారణ, వాస్తు యోగిని క్షేత్రపాలక నవగ్రహ సర్వతోభద్ర మండప పూజలు, అధివాసాలు, జలాధివాసం, క్షీరవాసం, ధాన్య, క్షయాధివాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, ఆలయ సిబ్బంది, సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సోమ వారం ఉదయం జరిగే శిఖర ప్రతిష్ఠ, మధ్యాహ్నం జరిగే భారీ అన్న సమారాధన కార్యక్రమాలకు టీటీడీ చైర్మన్, రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఆలయ పునర్నిర్మాణ దాత ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, దేవదాయ శాఖాధికారులు పాల్గొంటారని ఎర్నిమాంబ ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వెంకట సత్యసురేష్‌బాబా తెలిపారు.

నైట్ షెల్టర్‌కు అనాథ మహిళ తరలింపు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో సంచరిస్తున్న అనాథ మహిళను నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు నీల రెడ్డి ఇచ్చిన సమాచారంతో టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నైట్ షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి వెంటనే స్పందించారు. అనాథ మహిళను ప్రత్యేక వాహనంలో నైట్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. అనాథలు, బిచ్చగాళ్లు ఎవరైనా రోడ్లపై కనిపిస్తే 77939 77705 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమిస్తే వారిని నైట్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పిస్తామని జ్యోతిర్మయి తెలిపారు.

సమాచారమ్

అందుబాటులో ఎంప్లాయిమెంట్ అధికారులు


ఐటీఐ జంక్షన్‌లో జిల్లా ఉపాధి కార్యాలయం

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సెంటర్‌లో టెక్నికల్, క్లరికల్, జిల్లా సబ్ రీజినల్(ఎస్సీ, ఎస్టీ) విభాగాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాల గురించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. జాబ్‌మేళాలు, ఎంప్లాయిమెంట్ కార్డులు, రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్‌కు సంబంధించిన సమాచారం, అనుమానాలు, సందేహాలు నివృత్తి చేసుకునేందుకు కింద పేర్కొన్న ఫోన్ నంబర్లలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులను సంప్రదించవచ్చు.

జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
సిహెచ్.సుబ్బిరెడ్డి	క్లరికల్ అధికారి	83283 75788
కె.సుధ	టెక్నికల్ అధికారి	98492 31520
ఎస్.శ్యామ్‌సుందర్	సబ్ రీజనల్ అధికారి(ఎస్సీ, ఎస్టీ)	87001 57960

ఇంటర్‌లో ప్రవేశాలకు విద్యార్థినులకు ఆహ్వానం


పీ అండ్ టీ కాలనీలోని జీవీఎస్‌ఎంసీ హైస్కూల్-జూనియర్ కళాశాల

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీ హైస్కూల్, బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ తెలిపారు. అత్యున్నత విద్యార్హతలు, అంకితభావం గల అధ్యాపక బృందం, వివేకంతో కూడిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరేందుకు బాలికలు వెంటనే అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. బైపీసీ గ్రూప్‌లో 40 సీట్లు, ఎంపీసీలో 40 సీట్లు చొప్పున ఉన్నాయని చెప్పారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫారం, మధ్యాహ్న భోజన పథకంతోపాటు ఉచితంగా ప్రభుత్వ హాస్టల్ సదుపాయం ఉందన్నారు. అమ్మ ఒడి పథకం వర్తిస్తుందని తెలిపారు. 'ఆడపిల్ల చదువు అవనికి వెలుగు' అని నిరూపిద్దామని పిలుపునిచ్చారు.

వేటకు సన్నద్ధం


వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు











రెండు నెలల విరామం తరువాత గంగపుత్రులు వేటకు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి వేట నిషేధ సమయం కావడంతో మత్స్యకారులు పూర్తిస్థాయిలో పడవలను, వలలను సిద్ధం చేసుకున్నారు. మత్స్యకార గ్రామాల్లో ఏటా జరిగే గ్రామ దేవతల జాతరలు కూడా పూర్తవుతుండడంతో బుధవారం నుంచి వేటకు బయల్దేరుతున్నారు. ఫిషింగ్ హార్బర్‌లో సందడి వాతావరణం నెలకుంది. మరబోట్లు వేటకు సిద్ధమవుతున్నాయి. వేటకు అవసరమైన సరకులు సిద్ధం చేసుకుంటున్నారు. బోట్లు శుభ్రం చేసుకోవడం, నీరు నింపడం, విద్యుత్ సౌకర్యం, ఉప్పు బస్తాలు, ఐస్ నిల్వ చేసుకుంటున్నారు.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

దయాల్‌బాగ్‌లో వస్త్ర ప్రదర్శన

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు దయాల్ బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఫర్ ఉమెన్ బీఎస్సీ సెకండియర్ హోం సైన్స్ విద్యార్థులకు ఇక్కడ 40 రోజుల పాటు డ్రెస్ డిజైనింగ్‌లో శిక్షణ ఇచ్చారు. 26 మంది విద్యార్థులు తయారు చేసిన దుస్తులను ప్రదర్శించి, విక్రయించారు.